RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana
శనివారం । 13 । జూన్। 2026

జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జిని కలిసిన కొత్తగూడెం న్యాయవాదుల కార్యవర్గం

కొత్తగూడెం, జూన్ 12 (తెలంగాణ వాణి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయ వ్యవస్థ అభివృద్ధికి సంబంధించి కొత్తగూడెం బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు శుక్రవారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ జె. శ్రీనివాస్‌ను హైదరాబాద్ హైకోర్టులో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ వినతిపత్రంలో జిల్లాలో న్యాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి, రామవరం వద్ద నూతన కోర్టు భవనాల నిర్మాణం, న్యాయవాదులు మరియు వ్యాజ్యదారులకు అవసరమైన సౌకర్యాల కల్పన గురించి వివరించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద నమోదయ్యే కేసుల విచారణ కోసం జిల్లాలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. జిల్లాలో కేసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో అదనపు న్యాయ మౌలిక సదుపాయాలు, ప్రత్యేక కోర్టులు మరియు ఆధునిక సౌకర్యాల ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రతినిధి బృందం కోరింది. ఈ సందర్భంగా జస్టిస్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయవాదులు మరియు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్ కుమార్ మధుల్కర్, ప్రధాన కార్యదర్శి మహేష్ గడిపెల్లి, కార్యవర్గ సభ్యులు కే. సంజీవరావు, షాజహాన్ పర్వీన్, జి. నాగరాజు, బి. దేవదాస్, డి. ప్రసాద్, ఉమా, ఉషారాణి, బార్ అసోసియేషన్ సలహాదారు రమేష్ కుమార్ మక్కడ్, న్యాయవాదులు పప్పుల ప్రసాద్, కే. రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

ఆకలికి అన్నమే ఆయుధం

సేవకు సప్తవర్షాల సాక్ష్యం
నిత్యాన్నదాన సత్రం సేవలకు ఏడు సంవత్సరాలు
కోనేరు కోనప్ప సేవా యజ్ఞానికి ప్రత్యేక పూజలు

ఆదిలాబాద్ బ్యూరో జూన్ 12 (తెలంగాణ వాణి)

ఆకలితో అలమటించే వారికి ఒక్క పూట భోజనం అందించడం కూడా ఈ కాలంలో పెద్ద సేవగా భావించే పరిస్థితుల్లో వేలాది మంది నిరుపేదలు, అనాథలు,బాటసారులు, అవసరమైన వారికి గత ఆరు సంవత్సరాలుగా నిరంతరం గా అన్నదానం చేస్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగించడం అరుదైన విషయం. అలాంటి సేవా సంకల్పంతో ప్రారంభ మైన సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప నిత్యాన్నదాన సత్రం విజయవంతంగా ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకుని ఏడవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన శుభసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమా లు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆధ్యాత్మిక వాతావరణంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు,ప్రజలకు అన్నప్ర సాద వితరణ చేపట్టి సేవా కార్యక్రమాన్ని కొనసాగిం చారు.

సేవకు సంకల్పం సమాజానికి సందేశం

"ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అన్నిటికంటే గొప్ప దానం"అనే భావనతో ప్రారంభమైన ఈ నిత్యాన్న దాన సత్రం,కాలక్రమేణా వేలాది మంది ఆశ్రయంగా మారింది. రోజువారీ కూలీలు, ప్రయాణికులు,నిరుపేదలు, అనాథలు, ఆహారం కోసం ఎదురుచూసే ఎన్నో కుటుం బాలకు ఈ సత్రం ఆధారంగా నిలిచిందని స్థానికులు పేర్కొంటున్నారు. అన్నదా నం అనేది కేవలం ఆహారం అందించడం మాత్రమే కాకుండా, ఒక మనిషి ఆకలిని తీర్చడం ద్వారా అతనికి జీవన ఆశను అం దించడం అనే భావనతో ఈ కార్యక్రమం కొనసాగు తోందని నిర్వాహకులు తెలిపారు.

ప్రత్యేక పూజలు వేద ఆశీర్వాదాలతో సేవా యజ్ఞానికి శ్రీకారం

ఏడవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా నిర్వహిం చిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు వేద పండి తులు కమలా లాకర్ శర్మ ఆధ్వర్యం వహించారు. వేద మంత్రోచ్చారణలు, హోమాలు,ఆశీర్వచనాలతో కార్యక్రమం ఆధ్యాత్మికంగా కొనసా గింది. ఈ కార్యక్ర మంలో సిర్పూర్ మాజీ శాసన సభ్యులు కోనేరు కోనప్ప-రమాదేవి దంపతులు,వారి కుటుంబ సభ్యులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని,మరింత మందికి ఉపయోగపడాలని ప్రార్థనలు చేశారు.

ఆరు సంవత్సరాల ప్రయాణం..వేలాది జీవితాలకు భరోసా

గత ఆరు సంవత్సరాల కాలంలో ఎన్నో మంది ఆకలితో ఉన్న వారికి ఆహారం అందిస్తూ నిత్యాన్నదాన సత్రం ప్రత్యేక గుర్తింపు సంపాదించు కుంది. రోజువారీగా అనేక మంది ఈ సత్రాన్ని ఆశ్రయిస్తూ భోజనం పొందుతున్నారు. సేవా కార్యక్రమం విస్తరణతో పాటు,భవిష్యత్తులో మరింత మంది అవసరమైన వారికి చేరువ కావాలనే లక్ష్యంతో కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్వాహకులు భావిస్తున్నారు.

ప్రజల ప్రశంసలు సేవా భావానికి అభినందనలు

స్థానిక ప్రజలు,భక్తులు, సామాజిక కార్యకర్తలు ఈ సేవను అభినందించారు. రాజకీయ పదవులు తాత్కా లికమైనవైనా సమాజానికి చేసే సేవే శాశ్వ తమని పలు వురు అభిప్రాయ పడ్డారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం మహాదానం ఆ సేవను నిరంతరంగా కొన సాగించడం గొప్ప విషయం. ఇలాం టి సేవా కార్యక్రమాలు సమాజంలో మరింత పెరగాలి అని పలువురు ఆకాంక్షించారు.

మరెన్నో సంవత్సరాలు కొనసాగాలని ఆశాభావం

ఏడవ సంవ త్సరంలోకి అడుగుపెట్టిన ఈ నిత్యాన్న దాన సత్రం మరింత విస్తరించి,మరెన్నో కుటుంబాలకు అండగా నిలవాలని ప్రజలు ఆకాంక్షించారు. సేవ,సహనం, సమాజం పట్ల బాధ్యత అనే విలువలకు ప్రతీకగా ఈ కార్యక్రమం కొనసాగాలని కోరుకున్నారు. ఆకలితో ఉన్నవారికి అన్నం అవసర మైన వారికి అండ ఇదే నిత్యాన్నదాన సత్రం అందిస్తున్న సందేశమని కార్యక్రమానికి హాజరైన వారు పేర్కొ న్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల ఈఎస్ఐ ఖాతాల్లో నగదు జమ ప్రారంభం

యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపిన ఏఐటీయూసీ నాయకులు

కొత్తగూడెం సింగరేణి, జూన్ 12 (తెలంగాణ వాణి)

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మే నెల వేతనాలతో పాటు ఈఎస్ఐ నగదు జమ ప్రక్రియ ప్రారంభమైనట్లు ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం సర్కులర్ జారీ చేయడంతో జూన్ నెల నుంచి అర్హులైన కార్మికుల ఈఎస్ఐ ఖాతాల్లో నగదు జమ అవుతున్నట్లు వెల్లడించారు. శుక్రవారం కార్పొరేట్ సివిల్ కార్యాలయం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు కే.డబ్ల్యూ. కృష్ణ మాట్లాడుతూ, ఈఎస్ఐ అమలు కోసం ఏఐటీయూసీ ఎన్నో సంవత్సరాలుగా పోరాటం చేసిం దన్నారు. గత ఏడాది 18 రోజుల సమ్మె ఒప్పందంలో భాగంగా కాంట్రాక్టర్లు, కాంట్రాక్ట్ కార్మికు లను ఈఎస్ఐలో నమోదు చేసినప్పటికీ నగదు జమ ఆలస్యం కావడంతో యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చామని తెలిపారు. దీని ఫలితంగానే మే నెల నుంచి ఈఎస్ఐ చెల్లింపులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. ఈఎస్ఐ ద్వారా గుండె జబ్బులు, క్యాన్సర్, ప్రమాదాల వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు మెరుగైన వైద్యంతో పాటు కుటుంబ సభ్యులకు కూడా ఉచిత వైద్య సేవలు లభిస్తాయని చెప్పారు. కార్మికులు ఈఎస్ఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్కులర్ జారీ చేసిన సింగరేణి యాజమాన్యానికి ఏఐటీయూసీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఈ సౌకర్యం అన్‌స్కిల్డ్, సెమి-స్కిల్డ్ కాంట్రాక్ట్ కార్మికులకు మాత్రమే వర్తిస్తోందని, వేతన పరిమితిని పెంచి స్కిల్డ్ కార్మికులు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు కూడా వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు జె. రమేష్, రబ్బాని పాషా, ప్రవీణ్, శంకర్, భాస్కర్, వీరయ్య, గణేష్, సంపత్, సునీల్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్

కొత్తగూడెం, జూన్ 12 (తెలంగాణ వాణి)

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మణుగూరు మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఉన్న ఇటుక బట్టీల యజమానులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థ సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని అన్నారు. ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం, రక్షణ మరియు గౌరవప్రదమైన బాల్యం పొందే హక్కు ఉందని పేర్కొన్నారు. చిన్నారులను పనిలో నియమించడం చట్టవిరుద్ధమని, బాల కార్మిక చట్టం ప్రకారం బాలలను పనిలో పెట్టుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. అనంతరం సీతారాంపురం గ్రామంలోని ఇటుక బట్టీలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కార్మికుల పరిస్థితులు, వారి పిల్లల విద్యా స్థితిగ తులు, బాల కార్మికులు ఉన్నారా లేదా అనే అంశాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇటుక బట్టీల యజమానులు నిర్వాహకులు తమ వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ బాల కార్మికులను నియమించకూడదని, కార్మికుల పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల కార్మిక నిర్మూలనలో యజమానులు, తల్లిదండ్రులు, ఉపాధ్యా యులు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. బాలల హక్కుల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం లేబర్ ఆఫీసర్ నాగరాజు, ఇటుక బట్టీల యూనియన్ ప్రెసిడెంట్ మల్లారెడ్డి, సెక్రెటరీ కొండలరావు, ఇటుక బట్టీల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

పైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా

మూడు నెలల్లో ప్రక్రియ పూర్తి కావాలి
సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి
జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశం

కరీంనగర్:జూన్ 12 (తెలంగాణ వాణి ప్రతినిధి)

జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పారద ర్శకంగా,వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశిం చారు. శుక్రవారం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా క్లినికల్ ఎస్టాబ్లిష్ మెంట్స్ యాక్ట్-2010 అమలు,ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లు,అనుమతుల జారీ ప్రక్రియపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేష న్ సందర్భంగా ఎదురవుతు న్న సమస్యలు,వాటి పరిష్కా ర మార్గాలు,రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభ తరం చేయడానికి తీసుకోవా ల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఆసుపత్రుల యాజమాన్యాలు ఇబ్బందు లు ఎదుర్కోకుండా సంబంధి త శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆసుపత్రులను సంబంధిత అధికారులు సంయుక్తంగా సమన్వయంతో తనిఖీలు చేయాలని సూచించారు. అవసరమైన మౌలిక సదు పాయాలు,భద్రతా ప్రమాణా లు,అగ్నిమాపక శాఖ,కాలు ష్య నియంత్రణ మండలి తదితర శాఖల అనుమతు లను పరిశీలించిన అనంతరం మాత్రమే నిరభ్యంతర ధ్రువీక రణ పత్రాలు (ఎన్ఓసీలు) జారీ చేయాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ దరఖాస్తుల పరిశీ లనలో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని,ప్రతి దరఖా స్తును నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మూడు నెలల లోపల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రైవేట్ ఆసు పత్రుల యాజమాన్యాలు ఎదుర్కొనే సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్ లైన్ నంబర్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచిం చారు. హెల్ప్‌లైన్ ద్వారా ఇతరత్రా ఇబ్బందులు రిజిస్ట్రే షన్ ప్రక్రియకు సంబంధించిన సందేహాలు,సాంకేతిక సమ స్యలు,అనుమతుల అంశాల పై మార్గదర్శకత్వం అందించా లని పేర్కొన్నారు. జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రైవేట్ వైద్య సంస్థలు ప్రభుత్వ నిబంధన లను తప్పనిసరిగా పాటించా లని కలెక్టర్ తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్- 2010 ప్రకారం అన్ని వైద్య సంస్థలు రిజిస్ట్రేషన్ పొందడం ద్వారా వైద్య సేవల నాణ్యత, పారదర్శకత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల రిజిస్ట్రేషన్లు ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతుందని కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.శ్రీరామ్, జిల్లా ఫైర్ ఆఫీసర్ ముప్పిడి శ్రీనివాస్ రెడ్డి,పోలీసు శాఖ ప్రతినిధులు,ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా అధ్యక్షురాలు ఆకుల శైలజ,ప్రధాన కార్య దర్శి మహేష్ కోశాధికారి నీలిమా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీట్,ఐఐటి పరీక్షల్లో అవకతవకలపై కరీంనగర్‌లో ఎన్ఎస్యుఐ ఆందోళన

కేంద్ర విద్యాశాఖ మంత్రిని తొలగించాలి
నీట్,ఐఐటి పేపర్ లీకేజీలపై అల్పోర్స్
నరేందర్ రెడ్డి డిమాండ్
పేపర్ లీకేజీలపై మోడీ సర్కార్‌పై అల్పోర్స్
నరేందర్ రెడ్డి ఫైర్
నీట్ పరీక్ష రద్దు అవమాన కరం
ధర్మేంద్ర ప్రధాన్ రాజీనా మా చేయాలి:
ఎన్ఎస్.యుఐ నేత యం.డి.ఇమ్రాన్
ఐఐటి అడ్వాన్స్‌డ్ పేపర్ లీక్ చరిత్రలో తొలిసారి:
వైద్యుల అంజన్ కుమార్

కరీంనగర్:జూన్ 12 (తెలంగాణ వాణి)

ప్రతిష్టాత్మక ఐఐటి మరియు నీట్ పరీక్షల లో అవకతవకలు జరగడం దేశ ప్రతిష్టకు భంగం కలుగు తుందని,అన్ని పరీక్షల్లో అవకతవకలు జరగడం, నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించడం విద్యా వ్యవస్థకు సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు & వివిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అల్పోర్స్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని తెలంగాణ చౌక్ వద్ద ఎన్ఎస్‌యుఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఏర్పా టు చేసిన భారీ నిరసన ర్యాలీకి కాంగ్రెస్ నేత ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి,కార్పొ రేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ హాజరై నీట్ పరీక్ష రద్దు చేయడం,మళ్ళీ నిర్వహించ డం అవమానకరమన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ నీట్ పరీక్షను రద్దు చేయడం చాలా అవమా నకరమని తెలిపారు. ఇటీవల చాలామంది యువకులు,వి ద్యార్థులు జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో సైతం నీట్ మరియు ఐఐటి పరీక్షల రద్దు పట్ల నిర్వహిం చిన ధర్నా కార్యక్రమం ప్రభు త్వానికి గుణపాఠం లాంటిద ని వారు చెప్పారు. సాంకేతిక సమస్యలైన డేటా లభించకపోవడం,సర్వర్ మొరాయించడం,సాంకేతిక లోపాలు అధికంగా ఉండడం, సరైన పర్యవేక్షణ లోపించడం మన విద్యా విధానానికి అడ్డంకిగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చైనా దేశంలో పరీక్ష పేపర్లు లీక్ చేసిన వారికి 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తారని గుర్తుచేశారు. విద్యార్థులు పేపర్ లీక్ కాలేదని వాదిస్తున్నప్పటికీ పరీక్షలు మళ్ళీ నిర్వహించాలని అనుకోవడం అవమానక రమని చెప్పారు. ఈ సంవత్స రం ఐఐటి రూర్కీ వారు ఐఐటి అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహించారని గుర్తు చేశారు. పరీక్షల నిర్వహణలో తప్పు లు ఉన్నాయని,అవకతవ కలు చోటు చేసుకున్నాయని విచారం వ్యక్తం చేస్తూ,ఐఐటి రూర్కీ సంస్థకు ప్రశ్నపత్రాలను సిద్ధం చేసే బాధ్యత నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. చరిత్రలో మొట్ట మొదటిసారిగా ఐఐటి అడ్వాన్స్‌డ్ పేపర్ కూడా లీక్ అవ్వడం బాధాకర మన్నారు. అడ్వాన్స్‌డ్ పరీక్ష చాలా కీలకమైన దని,ప్రపంచంలో మన విద్యా వ్యవస్థకు ఎంతో గౌరవం ఉందని,కానీ ఈ పేపర్ లీకేజీ వల్ల ఆ గౌరవం క్షీణిం చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొట్టమొదటిసారిగా ఐఐటి అడ్వాన్స్‌డ్ ప్రశ్నపత్రంలో తప్పులు ఉన్నాయని, భవిష్యత్తులో ఇలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్త పడాలని సూచించారు. నీట్ అండర్ గ్రాడ్యుయేట్ పరీక్ష రాసే వారు పేపర్ మళ్లీ లీక్ అవుతుందని సవాల్ విసిరి నా,కేంద్ర ప్రభుత్వం పట్టించు కోనట్లుగా వ్యవహరించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జంతర్ మంతర్ వద్ద చేసిన మహా ధర్నా కార్యక్రమం ప్రభుత్వానికి కనువిప్పు కావాలని చెప్పారు. సీబీఎస్ ఈ 10వ,12వ తరగతి ఫలితాల్లో సైతం చాలా అవకతవకలు ఉన్నాయని, పేపర్లు దిద్దడంలో నిర్లక్ష్యం వహించి తప్పులు చేశారని ఆరోపించారు. ఆన్‌లైన్ పద్ధతిలో పేపర్లను దిద్దిన ప్పటికీ తప్పులు దొర్లడం అవమానకరమన్నారు. అభివృద్ధి పథంలో పయనిస్తు న్న భారతదేశంలో విద్యా వ్యవస్థ కుప్పకూలడం విచారకరమని,ఇది మన అభివృద్ధిని సైతం ప్రభావితం చేస్తుందని వారు చెప్పారు. ప్రధానమంత్రి తక్షణమే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుండి తొలగించడమే కాకుండా, లోక్‌సభ సభ్యత్వాన్ని సైతం రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా జాతీయ స్థాయి పరీక్షలను సజావుగా నిర్వహించాలని హెచ్చరించారు. లక్ష ఉద్యోగా లు ఇస్తామన్న మోడీ ప్రభు త్వం ఉద్యోగాలు ఎక్కడ ఇచ్చిందని ప్రశ్నించారు. ప్రజా వ్యతిరేక విధానాలకు నిరస నగా దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి,ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్ నాయక్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజ నేయులు గౌడ్,సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత రెడ్డి,చింతల శ్రీనివాస్ రెడ్డి,జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు కిమ్ ఫహద్, గుర్రం వాసుగౌడ్, రెహమాన్, రమేష్, విక్రమ్, ఎండి అయాన్, సిహెచ్ చేతన్ రెడ్డి, సోఫియాన్, అన్సారీ, అనిల్, రేవంత్ తదితరులు పాల్గొ న్నారు.

లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం చేసుకోవాలి: డీఎల్ఎస్ఏ సెక్రటరీ రాజేందర్

కొత్తగూడెం, జూన్ 12 (తెలంగాణ వాణి)

మణుగూరు కోర్టులో జిల్లా న్యాయ సేవా సంస్థ (డీఎల్ఎస్ఏ) సెక్రటరీ రాజేందర్ న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న రాజీ చేయదగిన సివిల్, క్రిమినల్, చెక్కు బౌన్స్ తదితర కేసులను రాబోయే లోక్ అదాలత్ ద్వారా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా తక్కువ ఖర్చుతో, త్వరితగతిన కేసులు పరిష్కారమవుతాయని, కక్షిదారులకు సమయం, ధనం ఆదా అవుతాయని తెలిపారు. న్యాయవాదులు రాజీ చేయదగిన కేసులను గుర్తించి కక్షిదారులను లోక్ అదాలత్‌కు హాజరుపరిచి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మణుగూరు కోర్టు జడ్జి కంభపు సూరిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాని గురుకృష్ణ, ప్రధాన కార్యదర్శి వీర మధుసూదన్, న్యాయవాదులు, న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.